అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

– సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి

ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

– వార్త మెయిన్‌లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 12 ఫిబ్రవరి 2025 | 8 పేజీలు

తిరుపతి పురవీధుల్లో మంగళవారం సాయంత్రం పుస్తకం రెపరెపలాడింది. తిరుపతి పుస్తకప్రదర్శనపై గత శనివారం రాత్రి జరిగిన మతోన్మాదుల దాడికి వ్యతిరేకంగా 'తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక' ఆధ్వర్యంలో కవులు, రచయితలు, పుస్తక ప్రియులు, పలు ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున ప్రదర్శన నిరసన నిర్వహించారు. ప్రతి ఒక్కరి చేతిలో పుస్తకం ఎత్తిన జెండాగా రెపరెపలాడింది. సాయంత్రం 5 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి, నినాదాలు చేస్తూ ప్రదర్శన సాగింది. ప్రదర్శన ప్రారంభానికి ముందు 'తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక' కన్వీనర్ వాకా ప్రసాద్ మాట్లాడుతూ, పుస్తకాలపైన దాడి చేయడం హేయమైన చర్యని, ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమని అన్నారు.

మతోన్మాదుల దాడికి నిరసన

పుస్తక ప్రియుల భారీ ప్రదర్శన – దాడికి నిరసనగా రెపరెపలాడిన పుస్తకం

– వార్త మెయిన్‌లో, 2వ పేజీలో

సంతృప్తి స్థాయిలో అర్జీలను పరిష్కరించాలి

- రీ ఓపెన్‌కి తావు లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా రీ ఓపెన్ కి ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) పై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్,

2

అంతర్జాలం వినియోగంపై

అవగాహన అవసరం

– సోషల్ మీడియా క్రైమ్‌లపై అప్రమత్తంగా ఉండండి

– జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

– వార్త 2లో

జోరుగా...

కల్తీ చిక్కుడు విత్తనాలు

- నష్టపోతున్న రైతులు
- రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న విత్తన వ్యాపారులు
- విత్తనాలపై అవగాహన కల్పించని వ్యవసాయ శాఖ అధికారి
- రెచ్చిపోతున్న కల్తీ కేటుగాళ్లు
- పట్టించుకోని వ్యవసాయ అధికారి

– వార్త 2లో

అర్జీలను పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి) జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. (పిజిఆర్ఎస్) లో వచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. పరిష్కార%శీ% చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని ఆదేశించారు.రీ ఓపెన్ కి తావు లేకుండా పరిష్కారం చూపాలని అన్నారు. ప్రతి సోమవారం అన్ని మండల పరిధిలో, డివిజన్ పరిధిలో తప్పని సరిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని, ఈ కార్యక్రమం నిర్వహించు ప్రదేశం, సమయం అర్జిదారులకు తెలిసేలా సమాచారం ఇవ్వాలి అని అన్నారు. అర్జిదారులు వారి సమస్యకు పరిష్కార దిశగా గ్రీవెన్స్ రావడం జరుగుతుందని సంబంధిత అధికారులు అర్జీదారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానంగా విని సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ కు వెళ్లకుండా రోజువారీగా అర్జీలను ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. పిజిఆర్ఎస్ కు వచ్చిన అర్జీలకు పరిస్కారం చూపకుండా నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోస్మాండ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

విశాలాంధ –చిత్తూరు: పిల్లలు, యువత, పెద్దలు అంతర్జాలం వినియోగం పై అవగాహన పెంచుకుని దీని నుండి జరిగే అనర్థాల నుండి మనల్ని మనం కాపాడు కోవలసిన అవసరం ఉందని, ఈ దిశగా ఉపాధ్యాయులు, ఎంఈఓ లు అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పి మణికంఠ చందోలు తో కలసి సైబర్ క్రైమ్, మహిళలు , ఆడ పిల్లల భద్రత సంబంధిత అంశాల పై డిఎస్పి లు, సైబర్ క్రైమ్, డిఈఓ, ఆర్ఐఓ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్, ఎం ఈ ఓ లు అన్ని ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపల్ లు, హై స్కూల్ హెచ్ ఎం లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా వాడకం ఎక్కువ గా కలదని, తద్వారా ఎక్కువ క్రైమ్ లు పి,పెరుగు తున్నాయని, దీని నుండి యువత, విద్యార్థులు, పిల్లలు, పెద్దలు అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాలాన్ని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకునేలా అవగాహన పెంచుకుని దీని నుండి ఎదురయే సమస్యలను సైబర్ క్రైమ్ ల నుండి మనల్ని మనం కాపాడుకోవడమే కాకుండా పిల్లలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే విషయంలో ఎంఈఓ లు చొరవ చూపాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపల్ లు వారి పరిధిలోని విద్యార్థులకు ఈ అంశం పై అవగాహన పెంచాలన్నారు. ఎస్ పి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, పార్ట్ టైమ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వాట్స్ అప్ గ్రూప్ లో మెసేజ్ లు పంపించడం ఇలా చాలా రకాలుగా సైబర్ నేరాలకు లోనవుతున్నారని, బ్యాంక్ లావాదీవెల పై ఓటిపి నేరాలు, క్యూఆర్ స్కాన్ ఉపయోగించి లావాదేవీల ద్వారా మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. బలమైన ఆర్థిక సైబర్ మోసాల యంత్రాంగాన్ని సృష్టించడం కొరకు ఎస్ ఎం ఎస్ లు, టెలి గ్రామ్ మేనేజింగ్, వాట్స్ అప్ మేనేజింగ్ వెబ్ సైటు లు, మొబైలు యాప్ లు చెల్లింపు గేట్ వే లు, యూపిఐ, కంపెనీ లు బ్యాంక్ ఖాతాలు, మొదలైనవి ఉపయోగించ బడుతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి లక్షల డబ్బులు పోగొట్టుకుని చివరకు ఆత్మహత్యల వరకు వెళుతున్నారని దీని నుండి బయట పడేందుకు యువత ప్రయత్నం చేసేలా ఉపాధ్యాయులు, అన్ని వర్గాల వారు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం డిజిటల్ అరెస్ట్ లు అంటూ మోసాలు జరుగుతున్నాయని.ఇది ఎక్కువ ప్రచారంలో కలదని, దీనిని కూడా నమ్మవద్దని, ఎటువంటి ఇంటరాగేషన్ ఉన్నా ఫిజికల్ గా అధికారులు రావడం జరుగుతుందని, ఇటువంటి సమస్యలు ఎదురైన వారు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని, అవగాహన, అప్రమత్తతే ప్రధానమని తెలిపారు. ఈ అంశం పై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించి సైబర్ క్రైమ్ నుండి కాపాడుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు డిఎస్పి లు, సైబర్ క్రైమ్, డిఈఓ, ఆర్ఐఓ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్, ఎం ఈ ఓ లు, ప్రిన్సిపల్ లు, సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర –తిరుపతి : తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఆలయంలో ఫిబ్రవరి 19 నుండి 28వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.ఇందులో భాగంగా ఫిబ్రవరి 15న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయం మొత్తాన్ని, పూజా సామగ్రిని శుద్ధిచేసి సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణం చేస్తారు. ఈ కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :తేదీ :19-02-2025ఉదయం – ధ్వజారోహణంరాత్రి – హంస వాహనం 20-02-2025ఉదయం – సూర్యప్రభ వాహనం రాత్రి – చంద్రప్రభ వాహనం21-02-2025ఉదయం – భూత వాహనంరాత్రి – సింహ వాహనం22-02-2025ఉదయం – మకర వాహనంరాత్రి – శేష వాహనం 23-02-2025 ఉదయం – తిరుచ్చి ఉత్సవంరాత్రి – అధికారనంది వాహనం 24-02-2025ఉదయం – వ్యాఘ్ర వాహనంరాత్రి – గజ వాహనం25-02-2025ఉదయం – కల్పవృక్ష వాహనంరాత్రి – అశ్వ వాహనం26-02-2025ఉదయం – రథోత్సవం (భోగితేరు)రాత్రి – నందివాహనం27-02-2025ఉదయం – పురుషామృగవాహనంసాయంత్రం – కల్యాణోత్సవం,రాత్రి – తిరుచ్చి ఉత్సవం28-02-2025ఉదయం – త్రిశూలస్నానంసాయంత్రం – ధ్వజావరోహణం,రాత్రి – రావణాసుర వాహనంబ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ వాహనసేవల ముందు కోలాటాలు, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించనున్నారు.

పుస్తక ప్రియుల భారీ ప్రదర్శన

విశాలాంధ్ర – తిరుపతి :
ఏ పుస్తకాలుచదవాలి, ఏ పుస్తకాలు చదవకూడదో నిర్ణయించడానికి వీళ్ళెవరని ప్రశ్నించారు. ఒక బుక్ స్టాల్ నుంచి పుస్తకాన్ని లాక్కుని చించి పోగులు పెట్టి, దగ్ధం చేయడానికి యత్నించిన దుండగులు, విశాలాంధ్ర పుస్తక స్టాల్ పై కూడా దాడి చేసి ఈ.వి. పెరియార్ పుస్తకాలను అమ్మరాదని తీసేయించారని గుర్తు చేశారు. ఈ సంఘటనపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దాని కొనసాగింపుగా ఈరోజు పెద్ద ఎత్తున ప్రదర్శన జరిగింది. పుస్తకాల స్టాల్స్ పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. నినాదాల్లో ప్రధానంగా 'నూరుపువ్వులు వికసించని, వేయి ఆలోచనలు సంఘర్షించనీ' 'అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్' 'పుస్తకాలు జ్ఞాన నేత్రాలు' 'పుస్తకాలను చించినంత మాత్రాన, వాటిలోని భావాల్ని చంపలేరు' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఈ ప్రదర్శన ఆపీసర్స్ క్లబ్ సెంటర్, ఎస్పీ ఆఫీస్, ప్రకాశం రోడ్డు, చతుర్ముఖ ఆంజనేయ స్వామి ఆలయం సెంటర్ మీదుగా గాంధీ రోడ్డులోకి ప్రవేశించింది. రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్రజలంతా ప్రదర్శకులుపట్టుకున్న పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. విశాలాంధ్ర వద్ద ఆగి నినాదాలు చేశారు. నాలుగ్గాళ్ళ మండపం వద్ద అంతా వలయాకారంలో గుమిగూడి దాడికి నిరసనగా అనేక మంది వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రచయితలు మదురాంతకం నరేంద్ర, ఆర్.ఎం. ఉమా మహేశ్వరరావు, రచయిత, జర్నలిస్టు రాఘవ, మూరి శెట్టి గోవిందు, పేరూరు బాలసుబ్రమణ్యం, వెంకటరత్నం, యమలా సుదర్శన్, నాగులూరి దయాకర్, గొడుగు చింత గోవిందయ్య, నిర్మల, జనవిజ్ఞాన వేదిక నుంచి రెడ్డెప్ప, సాహితీ స్రవంతి నుంచి ఓ. వెంకటరమణ, వేమన వి జ్ఞాన కేంద్రం నుంచి నాగార్జున, తిరుపతి బాలోత్సవం నుంచి నడ్డి నారాయణ, అభ్యుదయ వేదిక నుంచి కడియాల వెంకటరమణ, పౌర చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి ఏ.ఎన్ పరమేశ్వర్ రావు, తిరపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సాకం నాగరాజ, అరసం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి, శంకరంబాడి సుందరాచారి పీఠం నుంచి మస్తానమ్మ, తెలుగు భాషోద్య సమితి నుంచి తమటం రామచంద్రా రెడ్డి, సిపిఐ నేతలు రామానాయుడు, పెంచలయ్య, విశ్వనాథ్, ఐద్వా తరపున సాయి లక్ష్మి, ఎస్.యూ.సీ.ఐ నుంచి లక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ చిక్కుడు విత్తనాలు

విశాలాంధ్ర – తిరుపతి: మార్కెట్లో మంచి ధర పలుకుతోంది.రైతులు సాగుపై దృష్టి పెడుతున్నారు...అవసరాన్ని సొమ్ము చేద్దామని కల్తీ వ్యాపారులు రెచ్చిపోతు న్నారు...విత్తనాలను కల్తీ చేస్తున్నారు...రైతులకు అంటగడుతున్నారు.. .జేబీలు నింపుకుంటున్నారు....రైతు నిలువు దోపిడీ చేస్తున్నారు...వ్యవసాయ శాఖ అధికారి పట్టించుకోలేదు...దుకాణా దారులతో కుమ్మక్కయ్యారు...రైతులను నట్టేట ముంచుతున్నారు...కర్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు.చిత్తూరు జిల్లా పలమనేరు డివిజన్లోని వి.కోట,బైరెడ్డిపల్లి,పలమనేరు మండలాల్లో కల్తీ విత్తనాల వ్యాపారం జోరందుకుంది.రైతుల అవసరాన్ని పలు దుకాణదారులు సొమ్ము చేసుకుంటున్నారు. కల్తీ విత్తనాలను విక్రయిస్తున్నారు.రైతులకు మాయమాటలు చెప్పి అంటగడు తున్నారు.గత మూడేళ్లుగా చిక్కుడు ధరలు నిలకడగా వున్నాయి. 10కిలోలు(మునువు)400 నుంచి 1200 దాకా పలుకుతోంది.రైతులు చిక్కుడు సాగుపై దృష్టి పెట్టారు.ధరలు ఆశాజనకంగా ఉండడంతో చిక్కుడు సాగు చేసేందుకు ఆసక్తి చూపారు.చిక్కుడు విత్తనాలకు డిమాండు పెరిగింది.విత్తనాల కోసం ప్రైవేటు విత్తన దుకాణాలను ఆశ్రయిస్తున్నారు.ఇదే అదునుగా పలు విత్తన దుకాణాదారులు తక్కువ ధరలకు కల్తీ విత్తనాలను తేప్పించుకుంటున్నారు.రైతులకు బహిరంగంగా అమ్ముతున్నారు.చిక్కుడు విత్తనాలతో..అదే పోలిక ఉన్న అనప విత్తనాలను కలిపి ప్యాకెట్లతో నింపుతున్నారు.నాణ్యమైన విత్తనాలు మంచి దిగుబడి వస్తుందంటూ నమ్మ పలుకుతున్నారు.పలు రకాల విత్తనాల పేరుతో కిలో విత్తనాలు 750 నుంచి 5 వేల చొప్పున అమ్ముతున్నారు.పట్టణంలోని పలు దుకాణాదారులు ఇష్టముంటే తీసుకోండి..లేకుంటే అవసరం లేదు అంటూ రైతులను బెదిరిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.విత్తనాలపై అవగాహన లేని రైతులు దుకాణాదారుల మాట నమ్ముతున్నారు.విత్తనాలు కొనుగోలు చేసుకుని పోలాల్లో విత్తుతున్నారు.పంట పెరిగి పూత దశకు వచ్చిన తర్వాత అసలు విషయం బయటపడుతోంది.చిక్కుడుకు బదులు అనప విత్తనాలు కలిపి అమ్మేశారని గుర్తిస్తున్నారు.చేసేదేమీ లేక మిన్నకుండిపోతున్నారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులది.అయితే ఈ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.విత్తనాలను పరీక్షించిన దాఖలాలు అసలు లేవు.కనీసం విత్తనాలు ఎంపిక?ఈ ప్రాంతానికి అణువైనవేనా?? మొలకశాతం ఎలా వుండాలి? వుంటుంది???ఏ ఏ రకం విత్తనాలు కొనుగోలు చేయాలి??? ఏ దుకాణాలకు అనుమతి ఉంది? ఎక్కడ కోనుగోలు చేయాలి?అన్న కనీస అంశాలను రైతులకు అవగాహన కల్పించిన పాపాన పోలేదు.ప్రతినెల దుకాణాలను తనిఖీ చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.వ్యవసాయ అధికారుల ధన దాహానికి తాము బలవ్వాల్సిన దుస్థితి దాపురించిందని కొంతమంది రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.చిక్కుడు కాయలకు మార్కెట్లో మంచి ధర పలకడంతో ఈ పంట సాగుపై దృష్టి పెడుతున్నాము.విత్తనాలు భారీ డిమాండ్ ఏర్పడింది.పలు దుకాణాల్లో విత్తనాలు అందుబాటులో లేదు.బయట నుండి తెప్పించేందుకు అడ్వాన్స్ ఇవ్వాలని కొంత నగదు తీసుకుంటున్నారు.ఇదే అదునుగా విత్తన దుకాణదారులు కల్తీ విత్తనాలు అంటగడుతున్నారు.దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి దాపరించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలమనేరు హార్టికల్చర్ పరిధిలో వ్యాప్తంగా సుమారు 500 హెక్టార్లలో చిక్కుడు సాగయింది.ఎకరా చిక్కుడు సాగుకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయలు వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.తీరా పంట కాపు దశకు వస్తేనే గాని కల్తీ విత్తనాల విషయం బయటకు వస్తుంది.దీంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది.పాపేపల్లి, గాండ్లపల్లి,జవునిపల్లి, నక్కనపల్లి, బోయచిన్నగనపల్లి,ముదరం దొడ్డి,చింతమాకులపల్లి, గోనుమాకులపల్లి,కృష్ణాపురం, తదితర గ్రామాల్లో రైతులు కల్తీ విత్తనాల బారిన పడ్డారు.విత్తన దుకాణదారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విత్తన దుకాణదారులతో చేతులు కలిపి రైతులకు ద్రోహం చేయడం న్యాయం కాదని నిట్టూరుస్తున్నారు.ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి కల్తీ విత్తనాలు విక్రయిస్తున్న విత్తన దుకాణదారులు,పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారిపై కఠిన చర్యలు తీసుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని వారు కోరుతున్నారు.శ్రీధర్– కృష్ణాపురంనా పేరు శ్రీధర్ సుమారు ఎకరం భూమిలో చిక్కుడు సాగు చేపట్టాను.విత్తనాలు వీ.కోట పట్టణంలోని ప్రైవేట్ విత్తన దుకాణాల వద్ద కొనుగోలు చేశాను.విత్తనం విత్తిన అనంతరం కల్తీ బయటపడింది. చిక్కుడుకు బదులుగా అనుప విత్తనాలు కలిపి అమ్మేశారు.ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ శాఖ అధికారి పట్టించుకోలేదు.వెంకటరమణ–మద్దిమాకు లపల్లి మూడు ఏళ్లుగా చిక్కుడుకు గిట్టుబాటు ధర ఉంది.దీంతో చిక్కుడు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.విత్తనాల కొరకు మండల కేంద్రాల్లోని ప్రైవేట్ దుకాణాదారులను ఆశ్రయిస్తున్నారు.కిలో 500 ఉన్న చిక్కుడును 750 వరకు విక్రయించారు.ఇంత రేటా అని ప్రశ్నిస్తే... ఇష్టం ఉంటే తీసుకో... కష్టం ఉంటే ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు.రైతుల శ్రేయస్సు దృష్ట్యా విత్తనాలు ఎంపిక,విత్తనాలు అందుబాటు, ఏలాంటి విత్తనాలు కొనుగోలు చేయాలి? ఈ ప్రాంతానికి అనువైనవేనా? అన్న సమాచారాన్ని వ్యవసాయ శాఖ అధికారి అవగాహన కల్పించలేదు.దీంతో ప్రైవేట్ దుకాణాలు దారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా రైతులను దోచుకుంటున్నారు.కల్తీ విత్తనాలను అరికట్టాలి.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- జిల్లా ఆటో డ్రైవర్ల యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర - చిత్తూరు: చిత్తూరు జిల్లా పెనుమూరు మండల కేంద్రంలో ఉన్నటువంటి మండల ఆటో డ్రైవర్ల సమితి సమావేశం ఈరోజు ఉదయం 11 గంటలకు స్థానిక రాములు గుడిలో రమేష్ గారి అధ్యక్ష తన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర మాట్లాడుతూ, ఏఐటియుసి నిర్మాణం గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, యూనిఫామ్, లైసెన్సు సంబంధిత సర్టిఫికెట్లు అన్ని కలిగి ప్రయాణికులతో సత్సంబంధాలు అదేవిధంగా ఆటో యూనియన్‌లో సభ్యత్వం తీసుకొని ప్రతి ఒక్కరు యూనియన్ నిర్మాణం ప్రకారం, మీ యొక్క సమస్యల పైన మండల నాయకుల ఆధ్వర్యంలో పరిష్కరించుకోవాలని కోరారు .మీకు ఎప్పుడు ఏఐటియుసి అండ దండలు ఉంటుందని, మీకు సహాయ సహకా రాలు ఏఐటియుసి అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ ,జిల్లా కోశాధికారి రగులు మాట్లాడుతూ, ఈ యొక్క నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ ,ఈ మండలంలో ఎన్నికైనటువంటి ప్రతి నాయకుడు బాధ్యత వహించి ,ఆటో డ్రైవర్లకు ఉన్నటువంటి సమస్యల పైన ప్రతి ఒక్కరూ కమిటీలో చర్చించుకుని, ఏవైతే పరిష్కారానికి అనుగుణంగా ఉంటుందో దాని ప్రకారం మీరందరూ కలిసి కట్టుగా ఐక్యమత్యంగా ,ఆ సమస్యలను పరిష్కరించే విధంగా, మీరు సమయం తీసుకుని వాళ్ళ కోసం పని చేయాలని ,అదే విధంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని , 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఆటో కార్మికునికి 6000 రూపాయలు పెన్షన్, ఇల్లు లేని ప్రతి ఆటో కార్మికునికి మూడు సెంట్ల ఇంటి పట్టాను ఇవ్వాలి.ఓలా, రాపిడో, ఓ బీ రా కంపెనీలను రద్దు చేయాలి. ప్రైవేటు ఫైనాన్స్ వాళ్ల ఆటో డ్రైవర్ల పై జరుగుతున్న వేధింపులు అరికట్టాలని, తదితర సమస్యల పైన, ఈనెల చివరి వారంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు , ధర్నా కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కొత్తగా ఎన్నికైనటువంటి మండల కమిటీ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయ వంతం చేయవలసిందిగా కోరుతున్నాం . ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమేష, సంజీవయ్య ,పి కృష్ణారెడ్డి, ఉదయ్, జీవరత్న నాయుడు, మురళి ,రాము, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో జనాభా విద్య విభాగం,ఎకనామెట్రిక్స్ విభాగాలు

ఏడు రోజుల వర్క్ షాప్

విశాలాంధ్ర -తిరుపతి : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లో నీ జనాభా విద్య విభాగం మరియు ఎకనామెట్రిక్స్ విభాగాలు కలిసి 7 రోజు లా ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహి స్తున్నాయి. ఈ కార్యక్రమం సోమవారం నుండి నిర్వహిస్తున్నారు. ఇందులో 120 మంది వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఆచార్యులు బోధించ డానికి అవసరమైన నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో తెలియజేయడమైంది. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యా లయాలలో కాలేజీలలో అధ్యాపకుల పాటించాల్సిన విధివిధానాల గురించి క్లుప్తంగా వివరించారు. తర్వాత జనాభా విద్య విభాగాధిపతి ప్రొఫెసర్ సాయి సుజాత మాట్లాడుతూ నూతన విద్యా విధానం మరియు విద్యా సంస్థల్లో బోధన , పరిశోధన, వృత్తిపరమైన వృద్ధి నాణ్యతను మెరుగుపరచడానికి డెవలప్మెంట్ ప్రోగ్రాములు చాలా అవసరం అని తెలియజేశారు. ప్రధాన వక్త అయిన టువంటి ప్రొఫెసర్ ఐవీ లలిత కుమారి బోధన నైపుణ్యాలను పెంపొందించడం, పరిశోధన, పండిత వృద్ధి, వృత్తిపరమైన అభివృద్ధి, సాంకేతిక సమగ్రత అభివృద్ధి, వ్యక్తిగత వృద్ధి గురించి వివరించడం అయినది . ప్రొఫెసర్ మరియు సోషల్ వర్క్ కోఆర్డినేటర్ చంద్రశేఖరయ్య మాట్లాడుతూ ఎఫ్డీపీలు బోధన పరిశోధన మరియు మొత్తం విద్య వాతావరణంలో నిరంతర అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఎఫ్‌డిపి ఒక సాధనంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జేఎంవి వినోదిని, ప్రొఫెసర్ మరియు ప్రోగ్రాం కోఆర్డినేటర్ సునీత పాల్గొన్నారు ఇందులో అధ్యాపకులు, అతిథి ఆధ్యాపకులు పాల్గొన్నారు.

బంగారు పతకం పొందడం నా అదృష్టం

విశాలాంధ్ర -తిరుపతి : స్థానిక తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసి నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న అనంత లా కాలేజ్ విద్యార్థి డాక్టర్. బి.మోహనలక్ష్మి ఈ సందర్భంగా డాక్టర్. బి.మోహనలక్ష్మి మాట్లాడుతూ తనకు గోల్డ్ మెడల్ రావడం చాలా సంతోషంగా వుందని, నా లో వున్న ప్రతిభని గుర్తించి అన్ని రకాల ముందుకు తీసుకెళ్ళి సహక రించిన నా తల్లి తండ్రులకి గురువులకి ప్రత్యేక అభిందలు తెలియచేస్తు రాబోయే రోజుల్లో సమాజం లో మంచి లాయర్‌గా గుర్తింపు తెచ్చుకొని జడ్జి స్థాయికి ఎదగాలని తమ కోరికని ఓ ప్రకటనలో తెలియ చేశారు.

హలో బంజారా -ఛలో సేవాగడ్

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద సంత్ శ్రీసేవాలాల్ 286వ జయంతి మహోత్సవాల పోస్టర్లను గిరిజన నవ సమాజ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్ మాట్లాడుతూ దేశంలో 15 కోట్ల బంజారాల ఆరాధ్య దైవం ఆధ్యాత్మిక గురువు సామాజిక క్రాంతి వీరుడు సేవాలాల్ మహారాజ్ అని అన్నారు.బంజారాల జాతి ప్రజలను చైతన్యపరిచి విద్య, వైద్యం, ఆచార్య సంప్రదాయాలను కీర్తి వెలిగించిన జ్ఞాన జ్యోతి సేవాలాల్ మహారాజ్ స్థిర నివాసం లేని బంజారాలను గుర్తించి వారిని తండా రూపంలో సుస్థిరం కల్పించారు.మూఢనమ్మకాలను వ్యతిరేకంగా పోరాడిన బంజారాల కులదైవం సేవాలాల్ మహారాష్ట్ర,కర్ణాటక, రాజస్థాన్, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ వివిధ రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రమైన సేవాగడ్ నందు కుటుంబ సమేతంగా దర్శించి పునీతులవుతున్నారు.గత 25సంవత్స రాలుగా సేవాలాల్ జయంతి ఉత్సవాలను అనంతపురం జిల్లా గుత్తి మండలం సేవాగడ్ నందు బంజారాల ప్రజలే నిర్వహిస్తున్నా రు.దేశవ్యాప్తంగా వేలాదిగా వచ్చే భక్తులు కి అక్కడ సరైన మౌలిక సదుపాయాలు మరుగుదొడ్లు,స్నానపు గదులు,భోజన సదుపాయాలు లేవు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు.సేవాలాల్ జయంతి రోజు అయిన ఫిబ్రవరి 15న కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలనీ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సేవాలాల్ జయంతి ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ తరపున మంజూరు చేసిన 50 లక్షల నిధులు రూపాయలు సరిపోనందున 2కోట్ల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలను వేలాది భక్తులు తరలివచ్చి జయప్రదం చేయవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన నవ సమాజ్ నాయకులు చంద్రశేఖర్ నాయక్,సునీల్ నాయక్,బాలు నాయక్, అడ్వకేట్ మాసుమయ్య,భార్గవ్, సాయి, సూర్య, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థినిలు తల్లి దండ్రులకు అప్పగింత

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు జానకిరామ్ పేటలో ఉన్న ప్రభుత్వ గిరిజన హాస్టల్ నుండి అదృశ్యమైన ఇద్దరు బాలికలను దక్కిలి మండలం శ్రీపురంలో వారి బంధువుల ఇంట ఉన్నారని బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని గూడూరు డిఎస్పి గీతా కుమారి వెల్లడించారు .గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జానకిరామ్ పేటలో ఉన్న ప్రభుత్వ గిరిజ న పాఠశాల మరియు హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు సోమ వారం మధ్యాహ్నం నుండి కనిపించలేదని సాయంత్రం అధ్యాపకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే పలు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి అర్ధ రాత్రి దక్కిలి మండలం శ్రీపురంలో వారి బంధువుల ఇంటి వద్ద ఉన్నారని గుర్తించడం జరిగిందని వెల్లడించారు. బాలికలతో మాట్లాడగా మానసిక ఒత్తిడితో పాఠశాల నుండి వెళ్లి పోయామని తెలియజేశారని పేర్కొన్నారు. బాలికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని కేసును చాలెంజ్ గా తీసుకొని పలు బృందాలను ఏర్పాటు చేసి కొన్ని గంటల్లోనే బాలికలనుగుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెండోపట్టణ సీఐ శ్రీనివాస్ , ఎస్ఐ రాజు ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే చేయూత

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణం లోని 7వ వార్డ్ అశోక్ నగర్ నందు స్వర్గస్తులైన అన్నెం పెంచలమ్మ కుటుంబానికి గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు స్థానిక నాయకులు తూపిలి శ్రీనివాసులు , బండి సాయి కృష్ణ లు కుటుంబ సభ్యులకు 5 వేల రూపాయలను అందచేశారు.

రైతులకు గుర్తింపు సంఖ్య

నమోదు ప్రక్రియ ప్రారంభం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలో వ్యవసాయం కొనసాగిస్తున్న రైతులు కచ్చితంగా గుర్తింపు సంఖ్యను అన్ లైన్ లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి భారతి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలలో మంగళవారం వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు గుర్తింపు నమోదు ప్రక్రియ మొదలైంది అంటూ ఆన్ లైన్ లో నమోదు ప్రక్రియ మొదలుపెట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి భారతి మాట్లాడుతూ రైతులకు గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతీ రైతుకు 'ఆధార్' మాదిరి 14 అంకెలతో కూడిన యూనిక్ కోడ్ సంఖ్యను కేటాయిస్తూ గుర్తింపు కార్డులు జారీకి చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్డుల ద్వారా రైతులకు సంక్షేమ పథకాలతోపాటు పంట నష్టం, బీమా పరిహారం తదితర సేవలను పారదర్శకంగా అమలు చేయనుంది. వాతావరణంలో మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించి అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టనుందని వివరించారు.ఈ సంఖ్య ప్రామాణికం కానున్న నేపథ్యంలో రైతులంతా 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్స్‌లను గ్రామ వ్యవసాయ సహాయకుడికి అందించాలి. ఆ వివరాలను వి.ఏ.ఏ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతుకు చెందిన సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నెంబర్‌తో వి.ఏ.ఏ లాగిన్ ద్వారా రైతుల వివరాలను సరిచూస్తారు. పాస్‌పుస్తకాల్లో ఉన్న వివరాలు సక్రమంగా ఉంటె 14 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు అందిస్తారు. ఒకవేళ రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోతే వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. వీఆర్వో పరిశీలించి తహసీల్దార్‌కు వివరాలు అందిస్తారు. వాటిలో తప్పులను రికార్డుల మేరకు సరిచేసిన తరువాత వి.ఏ.ఏకు పంపిస్తారు. ప్రస్తుతం నమోదు ప్రక్రియ సాగుతోంది. రైతులు తగు ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ లో కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు.

యుద్ధప్రాతి పదికన పనులు చేయాలి

- పెండింగ్ పనులన్నీ పూర్తి కావాల్సిందే
- మండల అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

విశాలాంధ్ర - పలమనేరు : మండలంలో తాగునీటి సమస్య తలెత్తితే అధికారులపై చర్యలు తప్పవని పలమనేరు శాసనసభ్యులు అమర్నా థరెడ్డి హెచ్చరించారు. పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ నిధులు ఉన్నా మొదటి ప్రాధాన్యత క్రమంలో తాగునీటి కోసం ఖర్చు చేసి నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలన్నారు. ఇక సీసీ రోడ్లు, అంగన్వాడి భవనాలు, అంగన్వాడి కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణం, చెక్ డ్యామ్లు ఏర్పాటు, పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇక పెండింగ్ బిల్లుల పరిస్థితి, రెవిన్యూ సదస్సులలో గుర్తించిన సమస్యలు, మోడల్ స్కూళ్ళ ఏర్పాటుతో మూతపడనున్న పాఠశాలల వివరాలు, లోవోల్టేజి సమస్య ఉన్న గ్రామాలు మరియు సబ్ స్టేషన్ లు అవసరం ఉన్న పంచాయతీల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక సాంఘిక సంక్షేమ హాస్టళ్ళల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. బాలికల హాస్టల్స్ వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అధికారులకు క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఉన్నతాధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని చేరువ చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.ఈ సమీక్షలో తహసిల్దార్ ఇన్బనాథన్, ఎంపీడీవో ఖాదర్ బాషా లతో పాటు అన్ని శాఖల అధికారులు మరియు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం: ఆనంద రెడ్డి

విశాలాంధ్ర - రామకుప్పం : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు మరియు అభివృద్ధి పనుల కొరకు అమలు చేసి ప్రజల ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరిచేందుకు సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశల కృషి చేస్తున్నారని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పివిఎస్ మునిరత్నం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి , ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామిలు పేర్కొన్నారు మంగళవారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం లో వారు మాట్లాడుతూ రానున్న ఉగాది పండుగ తర్వాత ఇళ్ల నిర్మాణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అమ్మకు వందనం, రైతులకు చేయూత, తదితర వాటిని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై జననాయకుడులో అర్జీలను సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఇప్పటికే తారు రోడ్ల మరమ్మత్తులు, సిసి రోడ్లు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, నూతన భవనాలు, తదితర వాటికి అవసరమైన నిధులను మం జూర అయిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ బాబు, ఆంజనేయ రెడ్డి ,సీతాపతి , చిన్నకృష్ణ, చలపతి, గంట్లప్ప గౌడు, నందా రెడ్డి, విశ్వనాథ్, మంజునాథ్ , సురేష్, శంకరప్ప, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తితే

చర్యలు తప్పవు

- ఎంపీ సీఎం రమేష్ కు ఆహ్వానం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని అనకాపల్లి ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకులు సీఎం రమేష్ ను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆహ్వానించారు. ఆ మేరకు ఢిల్లీలో మంగళవారం ప్రత్యేకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

టీటీడీకి రెండు ద్విచక్ర వాహనాలు విరాళం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారికి మంగళవారం చెన్నైకి చెందిన టివిఎస్, బెంగళూరుకు చెందిన ఎన్ డివిఎస్ ఎకో సంస్థల ప్రతినిధులు విద్యుత్ ద్విచక్ర వాహనాలను విరాళంగా అందించారు. టీవీఎస్ ఐ క్యూబ్ ఎక్స్ వాహనం ధర రూ.2.70 లక్షలు, ఎన్ డివిఎస్ ఎకో వాహనం ధర రూ.1.56 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనం తాళాలను టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి ఆయా సంస్థల ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, ఎండి సుదర్శన్, తిరుమల డిఐ సుబ్రమణ్యం, ఎన్ డివిఎస్ ఎకో సంస్థ చైర్మన్ ఎంహెచ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సర్పంచ్‌కి తగదు

- టిడిపి నాయకుడు ఢిల్లీబాబు డిమాండ్

విశాలాంధ్ర - కార్వేటినగరం : గ్రామ పంచాయతీలోని స్మశాన వాటిక దాతల సహకారంతో చేస్తున్న అభివృద్ధి పనులను స్థానిక సర్పంచ్ అడ్డుకోవడం హేయమైన చర్య అని మండల యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఢిల్లీ బాబు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఢిల్లీ బాబు రెడ్డి మాట్లాడుతూ కార్వేటినగరం మండలం ఆర్ కె వి బి పేట గ్రామానికి సంబంధించి గ్రామ సమీపంలో ఉన్న స్మశాన వాటిక వద్ద గ్రామస్తులకు అదే గ్రామానికి చెందిన నెలవాయి చెంగారెడ్డి అనే దాత సుమారు 5 లక్షల రూపాయలతో స్నానపు గదులు, నీళ్ల ట్యాంకు, నిర్మాణ పనులు చేపడుతూ ఉంటే స్థానిక సర్పంచ్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు.గ్రామానికి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన గ్రామ సర్పంచే దాతలు చేస్తున్న పనులను అడ్డుకోవడం హేయమైన చర్యని ఢిల్లీ బాబు రెడ్డి ఆరోపించారు.మండల అధికారులు స్పందించి గ్రామంలో దాతల సహకారంతో చేస్తున్న అభివృద్ధి పనులను సాఫీగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకునే స్థానిక సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గొప్ప పశువుల పండుగ

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లిమండలంలో ఫిబ్రవరి 16న ఆదివారం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు గొప్ప పశువుల పండుగను జరుపుతున్నట్లు బైరెడ్డిపల్లి మండల పండుగ నిర్వాహకులు తెలియజేస్తున్నారు. ఈ పండగలో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతి రెండు లక్షలు రెండవ బహుమతి లక్ష రూపాయలు మూడవ బహుమతి 90000 ఈ విధంగా 25 నగదు భ్రమతులను ఇవ్వనున్నట్లు తెలియజేశారు. 150 ఎద్దులు మాత్రమే పాల్గొనుటకు అనుమతించబడింది. 1955వ సంవత్సరంలో బి బైరెడ్డి బి.దొడ్డే గౌడ బి.రామయ్య గౌడ్ ల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పండుగ గత 70 సంవత్సరాలు నుండి జరుగుతున్నది . పండుగను ఆనవాయితీ తప్పకుండా బైరెడ్డిపల్లి మండల ప్రజలు జరుపుకోవడం తెలిసిన విషయమే. ఈ పండుగ సందర్భంగా తమిళనాడు కర్ణాటక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో ఎద్దులు పరుగు పందేలలో పాల్గొంటాయి.

ప్రభుత్వ కాలేజ్ హాస్టల్లో ఎంఎస్ డబ్ల్యు హైమావతి చేతుల మీదుగా

పిల్లలకు టవల్స్ అందజేత

విశాలాంధ్ర - పలమనేరు : ప్రభుత్వం పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఎన్నో రకాలుగా అడుగులు వేస్తుంది ఆరోగ్యం, విద్య వసతి సౌకర్యాల్లో ఎంతో తోడ్పడగా ముందుకు వెళుతుంది ఇదే క్రమంలో భాగంగా పలమనేరు పట్టణంలో ఉన్న ప్రభుత్వ సంక్షేమ కాలేజ్ వసతిగృహం లో పిల్లలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వస్తువులను మంగళవారం కాలేజ్ హాస్టల్ వార్డెన్ రాజేష్ సమక్షంలో ఏ ఎస్ డబ్ల్యు హైమావతి చేతుల మీదుగా 74 మంది పిల్లలకు టవల్స్ అందజేశారు ఈ సందర్భంగా ఎస్ డబ్ల్యూ హైమావతి మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం అనేక విధాలుగా ఎన్నో సహకారాలు అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు తోడ్పాటు అందిస్తుందని ఆమె తెలిపారు ఇదే విషయంపై కాలేజ్ హాస్టల్ వార్డెన్ రాజేష్ మాట్లాడుతూ తమ కాలేజ్ హాస్టల్లో 74 మంది పిల్లలు ఉన్నారని వారిని తన సొంత పిల్లలాగా భావిస్తూ అన్ని విధాల సహకారం అందించడం చాలా సంతోషదాయకమని తెలిపారు.

455వ నేత్రదాతగా సూళ్లూరు వల్లెమ్మ

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో భాగంగా, సూళ్లూరుపేట, ఇందిరానగర్ వాస్తవ్యులు కీ.శే. సూళ్ళూరు వల్లెమ్మ (67 సం) మరణానంతరం వారి కార్నియాలను, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో సేకరించి చెన్నై శంకరనేత్రాలయ వారికి అందజేయడం జరిగింది. వీరు మరణించినా నేత్రదానం ద్వారా ఇద్దరు శరీరాలలో జీవించే ఉంటారు.ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో 455వ నేత్రదాత గా నిలిచారు అని ఆశ్చర్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు ఎం. ఎం. చంద్రబాబు తెలిపారు.

భూసేకరణలో మెరుగైన ప్యాకేజీలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర- సత్యవేదు: సత్యవేదు మండలం ఇరుగుళం,కొల్లడం, పెద్దఈటిపాకం గ్రామాల్లో ఏపీఐఐసీ చేపట్టిన భూసేకరణలో రైతులకు మెరుగైన ప్యాకేజీలు ఇచ్చే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు.మంగళవారం ఆయన భూసేకరణ గ్రామాల్లో పర్యటించి పలువురు రైతులతో చర్చించారు.ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బలవంతపు భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం మానుకోవాలి అన్నారు.2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి రైతుల ఆమోదంతో పరిహారం చెల్లించాలన్నారు.ప్రస్తుతం శ్రీసిటీ ఎస్ఇజెడ్ పరిధిలో దాదాపు 144 ఎకరాలు పరిశ్రమల కోసమని భూమిని సేకరిస్తున్నటు ఆయన పేర్కొన్నారు.అయితే ఇక్కడ రైతులకు డైరెక్ట్ గా నోటీసులు ఇస్తున్నారా తప్ప గ్రామ సభ నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదన్నారు.పరిహారం తేల్చే విషయంలో ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతున్నట్టు ఆయన ఆరోపించారు.కారు చావకాగా భూములు కొట్టేయడానికి ప్రభుత్వ యంత్రాంగం పావులు కదుపుతున్నట్టు సమాచారం ఉందన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం పర్యటిస్తున్న నేపథ్యంలో కొందరు ఆగతాయాలను శ్రీసిటీ సంస్థ ఉసిగొలిపిందని ఆయన ఆరోపించారు.రైతులు తమ వద్దకు వచ్చి కలవనీయకుండానే అడుగున అడ్డుకున్నట్టు ఆయన వ్యాఖ్యానించారు .తమ పర్యటనపై ముందస్తు సమాచారం ఉన్న ఇక్కడ శ్రీ సిటీ పోలీసులు ఎలాంటి భద్రత కల్పించకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.ఈ మూడు గ్రామాల పరిధిలో సుమారు 300 కుటుంబాలు సర్వం కోల్పోయారని భూములు కోల్పోతున్న రైతులే కాకుండా దాని మీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ,వ్యవసాయ పనులు లేక జీవనాన్ని కొనసాగించడం ఇబ్బందికరంగా తయారయిందని ఆవేదన వ్యక్తపరిచారు.వ్యవసాయ కార్మిక సంఘం పరిశ్రమల నెలకల్పనకు అభివృద్ధికి వ్యతిరేకం కాదని రైతులకు వ్యవసాయ కూలీలకు మెరుగైన ప్యాకేజీలు అందించి వారి అభివృద్ధిని పరచాలన్నారు.లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ అధ్యక్షులు దాసరి జనార్ధన్,వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు మెలుగు రమేష్,సత్యవేదు మండల రైతు సంఘ నాయకులు మునస్వామి,వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15 లోపు బృందావనాలను వినియోగంలోకి తీసుకురావాలి

- డివిజనల్ పంచాయతీ అధికారి రవీంద్రబాబు

విశాలాంధ్ర-సత్యవేదు:సత్యవేదు మండలంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఫిబ్రవరి 15 లోపు వినియోగంలోకి తీసుకురావాలని సులూరుపేట డిఎల్పిఓ రవీంద్రబాబు కోరారు.మంగళవారం స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్,పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణాక్ష రెడ్డితో కలిసి వానెల్లూరు, పెద్దఈటిపాకం, చిన్నఈటిపాకం ,సత్యవేదు తదితర ప్రాంతాల్లో బృందావనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా డిఎల్పిఓ రవీంద్రబాబు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నామ న్నారు.తడిచెత్త,పొడిచెత్తను వేరు చేసి బృందావనాల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాల్సి ఉందన్నారు.అయితే ఈ చెత్త సేకరణ, తరలింపుకు సంబంధించి పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.ఒకవేళ ఇప్పటికే పనిచేయని గ్రీన్ అంబాసిడర్ల స్థానంలో కొత్త వారిని ఆయా పంచాయతీలు నియమించుకోవచ్చున న్నారు .అయితే నియమ నిబంధనలకు లోబడి 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయాల్సి ఉందన్నారు.ఇందులో భాగంగా వేతనాల కోసం 30 నుంచి 50 శాతం,పారిశుద్ధ పనులకు 15 శాతం,తాగునీటికి మరో 15 శాతం ఖర్చు చేసే వెసులుబాటు ఉందన్నారు. దీంతోపాటు విద్యుత్ దీపాలకు 15 శాతం,ఇతర అవసరాలకు మరో 10 శాతం ఖర్చు చేయవచ్చును అన్నారు.ఈ నేపథ్యంలో చెత్తను తరలించే ట్రై సైకిళ్ళకు మరమ్మత్తు పనులు కూడా చేసుకోవచ్చు అన్నారు.అలాగే ఇంటి పన్ను మార్చి నెలాఖరు లోపు వసూలు చేసి 100 శాతం పూర్తి పూర్తి చేయాలన్నారు.దీనిపై డిమాండ్ నోటీసు ఇవ్వడం, చెల్లింపులు అన్నీ కూడా ఆన్లైన్లోనే జరగాలన్నారు.అలాగే మండలంలో ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో సత్యవేదు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్, జలజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 18 నుండి 26వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఫిబ్రవరి 17వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :18.02-2025ఉదయం - ధ్వజారోహణం (మీనలగ్నం) రాత్రి - పెద్దశేష వాహనం19-02-2025 ఉదయం - చిన్నశేష వాహనం. రాత్రి - హంస వాహనం.20-02-2025 ఉదయం - సింహ వాహనం. రాత్రి - ముత్యపుపందిరి వాహనం. 21-02-2025ఉదయం - కల్పవృక్ష వాహనం రాత్రి - సర్వభూపాల వాహనం.22-02-2025 ఉదయం - పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం) రాత్రి - గరుడ వాహనం.23-02-2025 ఉదయం - హనుమంత వాహనం. సాయంత్రం - స్వర్ణరథం,రాత్రి - గజ వాహనం.24-02-2025 ఉదయం - సూర్యప్రభ వాహనం. రాత్రి - చంద్రప్రభ వాహనం.25-02-2025 ఉదయం - రథోత్సవం, రాత్రి - అశ్వవాహనం 26-02-2025 ఉదయం - చక్రస్నానం, రాత్రి - ధ్వజావరోహణం.ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ వాహనసేవల ముందు కోలాటాలు, భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించనున్నారు.

డిగ్రీ కళాశాలలో స్కిల్స్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: స్థానిక ఎస్. వి .ఎస్ .ఎస్. సి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట, తిరుపతి జిల్లా, ఈరోజు కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో కోచింగ్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎల్ .బి. శంకర్ శర్మ మాట్లాడుతూ వివిధ రకాలైన పోటీ పరీక్షలకు (ఏపీపీఎస్సీ, గ్రూప్ వన్, గ్రూప్ టు, ఎస్ ఎస్ సి, ఆర్.ఆర్. బి, ఎస్బిఐ, యూ.పీ.పి.ఎస్సీ,) మొదలగు పరీక్షలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్,ఎనలిటికల్ స్కిల్స్, అర్థమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మొదలగు అంశముల పై విద్యార్థులను సన్నిధం చేయుటకు ఈ కార్యక్రమమును ప్రారంభించడం జరిగింది. దీనిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కెరీర్ గైడెన్స్ కన్వీనర్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ అంశాలలో నిష్ణాతులైన అధ్యాపకుల చే శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలియజేశారు. కళాశాల ఐ.క్యూ.ఏ.సి. కోఆర్డినేటర్ డాక్టర్ వి .రాజా మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులకు ఇది గొప్ప సదా అవకాశమని దీని వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ. సునీత , ఏం. అమ్మాజీ, ఏడుకొండలు, డి. ఉషారాణి, డి.నాగభూషణం, డాక్టర్ జి. కే.ప్రసాద్ మొదలగు అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సేఫ్ రైడ్ - సేఫ్ లైఫ్

- హెల్మెట్ దరిద్ధాం రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని,హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన హెల్మెట్ ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని డాలర్స్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ సి.గెహిణి రెడ్డి తెలిపారు.హెల్మెట్ వాడకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం కోసం తిరుపతిలోని డాలర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ డైరెక్టర్ సి.గెహిణీ రెడ్డి, వెస్ట్ సిఐ రామకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేసి, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు.తిరుపతి నగరం అన్నమయ్య కూడలిలో హెల్మెట్ దరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వాహన చోదకులకు 100 హెల్మెట్లను ఉచితంగా అందచేశారు.ఈ సందర్భంగా డాలర్స్ గ్రూప్ అధినేత డా.సి.దివాకర్ రెడ్డి కుమార్తె సి.గెహిణీ రెడ్డి మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుండే తమ ట్రస్ట్,రోడ్డు ప్రమాదాల నివారణ కోసం

హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేస్తూ హెల్మెట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ప్రతి ఇంట్లో, తండ్రికి ఆడబిడ్డ అంటే ఎక్కువ మక్కువగా ఉంటుంది కాబట్టి, ఉద్యోగ,ఉపాధి రీత్యా బయటకు వెళ్లిన తండ్రి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని కోరుకుంటూ తమ ట్రస్టు ద్వారా ఆడబిడ్డల చేత హెల్మెట్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు.తాము చేస్తున్న ఈ ప్రయత్నం ద్వారా ప్రతి ఒక్కరు హెల్మెట్లను ధరించి సురక్షితంగా ప్రయాణం సాగించాలని కోరుకుం టున్నట్లు తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్లను ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆమె కోరారు.

గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

విశాలాంధ్ర - గూడూరు: గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనినెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని చెన్నూరు లోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదలకు అభివృద్ధికి సహాయపడుతుం దన్నారు. అదేవిధంగా, గ్రంథాలయంలు పరిశోధకులకు ప్రామాణి కమైన నమ్మదగిన సమాచారాన్ని అందిస్తాయన్నారు. గ్రంథాల యాలు విద్యార్థినీ విద్యార్థుల ఏకాగ్రత స్థాయిలను పెంచడంలో గ్రంథాలయంలు సహాయ పడతాయన్నారు.లి డిజిటల్ యుగం కారణంగా మనం గ్రంథాలయాలను వదులుకోకూడదు. లైబ్రరీ నుండి పొందే ప్రామాణికత మరియు విశ్వసనీయతను ఏదీ భర్తీ చేయదు ఆ న్నారు.గ్రంథాలయ భవనముకు రూ.10.00 లక్షల విరాళంతో నిర్మించిన జొన్నా మోహన కృష్ణ, సునీతా దేవి నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను అన్నారు అదేవిధంగా , జిల్లాలోని ప్రతి పాఠశాలలో చదివి ఉన్నత స్థానములలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు, వారు చదువుకున్న పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నాను అన్నారు..అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, యం.పి.డి.ఓ మధుసూదన్ రావు, జడ్పీటీసీ ఉటుకూరు యామిని, తెలుగు పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి , విద్యాశాఖ అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

మిన్నల్ రవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, క్లస్టర్ ఇంచార్జ్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం సుబ్బయ్య, యూత్ ఆర్గనైజషన్ సెక్రెటరీ సాయి శివా రెడ్డి ఆధ్వర్యంలో యూత్ సమక్షంలో కేక్ కట్ చేసి మిన్నల్ రవిని ఘనంగా సన్మానించారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులతో మిన్నల్ రవి ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పేట బాలాజీ రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగ కార్యనిర్వ కార్యదర్శి నెమల్లూరు బుజ్జి, రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వాహ కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు, ముని రాజా యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర రావు, తొట్టంబేడు నాయకులు మనీ, భాస్కర్, ముత్తరాశి పాలెం యూత్. ప్రసాద్, ముని చంద్ర, ముని బాబు, ప్రసాదు, సాయి, హేమంత్, హర్ష కె.హరీష్, మహిళలు పట్టణ తెలుగుదేశం పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి దుర్గ, శాంతమ్మ, శ్రీదేవి, లక్ష్మమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది బేరం రామదాసు మృతి

విశాలాంధ్ర - వెంకటగిరి: వెంకటగిరి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది వెంకటగిరి బార్ అసోసి యేషన్ మాజీ అధ్యక్షులు బిగిరం రామదాసు మృతి చెందారు సీనియర్ న్యాయవాదిగా తెలుగుదేశం పార్టీ తరపున జడ్పిటిసి సభ్యుడిగా గతంలో పనిచేశారు పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ ప్రతి ఒక్క ఎమ్మెల్యే విజయానికి కృషి చేశారు ఒక సీనియర్ నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు వెంకటగిరిలో డిగ్రీ కాలేజ్ లేని రోజుల్లో ఎడ్యుకేషనల్ సర్వీస్ సొసైటీ ఏర్పాటు చేసి విశ్వదయ డిగ్రీ కళాశాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు ఆ తర్వాత ఈ ఎస్ ఎస్ డిగ్రీ కాలేజ్ అధ్యక్షులుగా పనిచేశారు మంచి న్యాయవాదిగా కాపు సంఘం నాయకుడుగా అనేక సేవలు చేశారు.

15న విక్రమ్ డిగ్రీ కళాశాల నందు జాబ్‌మేళా

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాల నందు జాబ్‌మేళాను ఈ నెల 15వ తేదిన నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.వరాభి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడ్ ఆఫ్, డిఆర్‌డిఏ సంయుక్త ఆధ్వర్యంలో విక్రమ్ కళాశాల నందు జరిగే ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, అల్ట్రామైన్ అండ్ పిగ్‌మెంట్స్ లిమిటెడ్, దొర గ్రూప్ ఆఫ్ కంపెనీస్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలలో ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవతరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, బిటెక్, డిప్లమా ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు అర్హులు అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్స్ జిరాక్స్, బయోడేటా ఫామ్‌తో పాటుజాబ్‌కార్డ్‌తో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. ఎన్ఎఐపియుఎన్‌వైఎఎం.ఏపి.జిఓవి.ఐఎన్ నందు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 7989509540, 8919889609 నెంబర్ల నందు సంప్రదించాలని కోరారు.

స్పెషల్ ఆఫీసర్ పర్యటన

విశాలాంధ్ర - చౌడేపల్లి: మండలంలోస్పెషల్ ఆఫీసర్ నరేంద్ర కుమార్ మండలంలో ఆకస్మికంగా ప్రకటించారు. స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో శ్రీమతి లీలా మాధవి , చందన కేశవరెడ్డి, సూపర్వైజర్ రమాదేవి హాజరయ్యారు. మండలంలోని పాఠశాలలను, అంగన్వాడి పాఠశాల లను, ప్రైమరీ హెల్త్ సెంటర్ ను, హాస్టలను సందర్శించారు.

వైష్ణవి దేవి మహిమలు

విశాలాంధ్ర - చౌడేపల్లి: మండలంలోని పొదుపట్ల గ్రామంలో వెలిసిన వైష్ణవి మాత మహిమలతో చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుంటున్నారు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధిగానిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు అమ్మవారిని ప్రతినిత్యం ప్రత్యేక అలంకరణలో అర్చకులు శ్రావణి వినోద్ కుమార్ దర్శనమిచ్చారు మంగళవారం ప్రాముఖ్యతగా అమ్మవారి కుడి కంటి నందు సూర్య కిరణాలు పడడంతో అమ్మవారు కాంతివంతంగా దర్శనమిచ్చారు అధిక సంఖ్యలో దృశ్యాన్ని చూడడానికి వైష్ణవి మాతా ఆలయాన్ని చేరుకున్నారు.

సోలార్ ప్లాంట్‌కు భూమి పరిశీలన

విశాలాంధ్ర - చౌడేపల్లి: మండలంలోనిదిగువపల్లి పంచాయతీ షికారి పాలెం రోడ్డు సమీపంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కొరకు భూమి పరిశీలన కార్యక్రమం మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి తాసిల్దార్ హనుమంతు నాయక్ ట్రాన్స్కో ఏఇ శశిధర్ సబ్ ఇంజనీర్ సంతోష్ కుమార్ సర్వేయర్ గుణశేఖర్ బోయకొండసుబ్బు సోము రెడ్డి బాలాజీ గుణ హరి తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో రాణించిన ఎంజీఎం స్కూల్ విద్యార్థిని కే.హనీషా

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : తిరుపతిలో జోనల్ లెవెల్‌లో విశ్వం ఎడ్యుటెక్ ఏ స్కిల్ కరికులం కంపెనీ వారు నిర్వహించిన తిరుపతి జిల్లాలోని వివిధ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులతో పోటీపడి స్టార్ జూనియర్స్ లెవెల్ వన్ లో అబాకస్ లో పార్టిసిపేట్ చేసి ఎంజీఎం స్కూల్ విద్యార్థిని కే. హనీషా ఫస్ట్ ర్యాంక్ సాధించింది. మొదటి ర్యాంకు సాధించిన ఎంజీఎం స్కూల్ విద్యార్థిని హనీషా విజయవాడ నందు స్టేట్ లెవెల్ అబాకస్ కాంపిటీషన్లో ఫిబ్రవరి 9వ తారీఖు జరిగిన స్టార్ జూనియర్స్ లెవెల్-1లో అర్హత సాధించి సర్టిఫికెట్, కప్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంజీఎం స్కూల్ విద్యార్థి అబాకస్ లో స్టేట్ లెవెల్ రాణించినందుకు ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య విద్యార్థినిని అభినందించారు.

అలిపిరివద్ద బ్రాండెడ్ కుంకుమ పసుపు విక్రయాలు

విశాలాంధ్ర – తిరుపతి : నిన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఆదేశాల మేరకు అలిపిరి ప్రాంతంలో మరియు మెట్ల ప్రాంతంలో కల్తీ పసుపు, కుంకుమ ఆహార పదార్థాల విక్రయం జరుగుతోందని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జిల్లా ఆహార భద్రత కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనుమానిత కల్తీ పసుపు, కుంకుమ విక్రయిస్తున్న వాటిని సీజ్ చేశారు. అలాగే వారికి అవగాహన కల్పించిన నేపథ్యంలో సదరు వీధి విక్రయ దారులు బ్రాండెడ్ కుంకుమ పసుపు విక్రయిస్తున్న వాటిని తనిఖీ చేసిన జిల్లా ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ వెంకటేశ్వర్ రావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు మద్దిలేటి, జగదీష్ తదితరులు తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకం

విశాలాంధ్ర–చిల్లకూరు: నాసిక్ లో జరగబోయే జంప్ రోప్ నేషనల్ చాంపియన్ షిప్ లో పాల్గొనబోయేందుకు ఎంపిక కాబడిన 9 మంది విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం నెలబల్లి–రెట్టపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ఎస్ వి రత్నం ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహనరావు ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రోత్సాహకంగా పారితోషికం అందించారు. పోటీలలో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ మంచి ఫలితాలతో ఉత్తమ ప్రదర్శన సాధించాలని ఆకాంక్షించారు. పిఇటి మస్తాన్ బీకు అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్‌లోని గడ్డి మోపులు దగ్ధం

విశాలాంధ్ర–పుత్తూరు: ట్రాక్టర్‌పైన తీసుకెళ్తున్న గడ్డి మోపులు అగ్నికి ఆహుతైన సంఘటన మంగళవారం పుత్తూరు పట్టణ పరిధిలోని చౌటూరు గ్రామ సమీపంలో చోటుచేసుకొంది. గ్రామస్తుల కథనం మేరకు తిరుపతి జిల్లా నాగలాపురంకు చెందిన శేఖం మొదలియార్ ట్రాక్టర్‌పైన 70 గడ్డి మోపుల కట్టలను వేసుకొని ఊరూర తిరుగుతూ అమ్మకానికి పుత్తూరు వచ్చాడు. అక్కడి నుంచి చౌటూరు గ్రామానికి వెళుతున్న సమయంలో పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో ట్రాక్టర్ను వెనకకు తిప్పే సమయంలో పక్కనే ఉన్న ట్రాన్సాఫార్మర్కు కసువు మోపు తగలడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యి అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే గడ్డి మోపులు పూర్తికాలిపోగా, ట్రాక్టర్ను బయటకు తీసి ప్రమాద స్థాయిని తగ్గించగలిగారు.

ఎస్సీ, ఎస్టీ మరియు బిసి విద్యార్థుల ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర–చిల్లకూరు: ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 190 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 5వతరగతి మరియు ఇంటర్మీడియట్ ప్రథమసంవత్సరం ప్రవేశాలకు గాను దరఖాస్తులు ఆన్ లైన్ లో కోరుతున్నారు. చివరి తేదీ మార్చి 6వతేదీ. దరఖాస్తులు సమర్పణకు మరియు ప్రవేశ పరీక్ష నిర్వహణ తేదీ ఏప్రెల్ 6వ తేది. ఆదివారం ఉదయం 9 గంటలకు 5 వతరగతికి , మధ్యాహ్నం 2 గంటలకు ప్రథమ ఇంటర్మీడియట్ తరగతి కి ప్రవేశ పరీక్షా సమయం మరియు ఐఐటి మెడికల్ ఎంట్రెన్సు పరీక్షకు ఏప్రెల్ 20వ తేదీన నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ యం. అనిల్ కుమార్ మంగళవారం తెలిపారు.

ప్రతి అసంఘటిత కార్మికులు ఈ -శ్రమ్ పోర్టల్ నమోదు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ -శ్రమ్ పోర్టల్ నందు నమోదు తప్పనిసరిగా చేసుకొని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందాలని అని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఈ – శ్రమ్ పోర్టల్ పై సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ– శ్రమ పోర్టల్ లో వారి పేర్లు నమోదు చేసుకోవడం వలన వారికి సామాజిక భద్రత మరియు సంక్షేమ పథకాలు అమలు అవుతాయని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియకు వయసు పరిమితి 16–59 సంవత్సరాలు వరకు ఉన్నవారు ఆదాయపు పన్ను చెల్లించని, పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని వారు నెలకు రూ. 15 వేలు లోపుజీతం తీసుకొనేవారు ఈ పథకముకు అర్హులు అని తెలిపారు. కార్మికుని ఆధార్ కార్డు నెంబర్, ఆధార్ తో లింక్ అయినా మొబైల్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఉంటే ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు. దగ్గరలో ఉన్న సచివాలయం, సిఎస్సి సెంటర్ లో గాని మీ–సేవ కేంద్రం ద్వారా కానీ నమోదు చేసుకోవచ్చని అన్నారు. తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ద్వారా కూడా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకొనే సదుపాయం కలదని ఈ పథకంలో చేరిన వారు ప్రమాదవశాత్తు మరణించిన రూ. 2 లక్షలు ప్రమాద బీమా, అంగవైకల్యం జరిగిన భీమావర్తించును. పాక్షిక అంగవైకల్యం కలిగిన వారికి రూ. 1లక్ష వరకు ఆర్థిక సహాయం పొందవచ్చు అని అన్నారు. కావున ఈ శ్రమ్ పోర్టల్ గురించి సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు.

ఎన్ ఎఫ్ టి యు జిల్లా కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర –తిరుపతి : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ ఎన్ ఎఫ్టియు జిల్లా కార్యవర్గం యూనియన్ ఆఫీసు నందు జరిగినది ఈ సమావేశమునకు స్పెషల్ ఇన్వైట్ గా సర్కుల్ కార్యదర్శి నాగేంద్రబాబు అలాగే ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మరియు జిల్లా ఉపాధ్యక్షులు కర్లపూడి గోవిందస్వామి హాజరయ్యారు .ఈ సమావేశమునకు అధ్యక్షులుగా కామ్రేడ్ గుర్రప్ప సెక్రెటరీగా ధనంజయుడు ఆల్ ఇండియా ఫంక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సౌందర్య రాజన్ మహిళ అధ్యక్షురాలు కామ్రేడ్ అమరావతి వీరితోపాటు 50 మంది సభ్యులు హాజరై వారి వారి సమస్యలు చెప్పుకోవడం జరిగినది. ఈ సమస్యల మీద రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రబాబు స్పందించి జనరల్ మేనేజర్ గారిని కలిసి సమస్యలను విశదీకరించడం జరిగినది. ఈ సమావేశమునకు హాజరైన ప్రతి ఒక్కరికి ఏఐటీయూసీ జిల్లా సమితి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నది. ఇట్లు మీ కర్లపూడి గోవిందస్వామి ఏఐటీయుసి జిల్లా ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం విడుదల: కలెక్టర్

లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిహారం అందించాలి

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : చెన్నై, బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు అభివృద్ధి కొరకు కొత్తపట్నం గ్రామ (కోట మండలం) తమ్మిన పట్నం (చిల్లకూరు మండలం) లో ప్రభుత్వ భూముల సాగులో ఉన్న రైతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట పరిహారం అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు చెన్నై, బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు అభివృద్ధి కొరకు ప్రభుత్వ భూములు సాగులో ఉన్న రైతులకు నష్ట పరిహారం విడుదల పై జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ%శీ%గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు వలన, మంచి పరిశ్రమ ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలో పంపించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి జిఓఎంఎస్ నెం. 43 రూ.78,84,83,200 మంజూరు చేసినదని తెలిపారు. సంబంధిత తాసిల్దార్లు సాగులో ఉన్న భూములను సర్వే చేసి ఎలాంటి అవకతవకలు లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ధారణ చేసుకున్న తర్వాతనే పరిహారం అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నెల్లూరు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, శివ కుమార్, కోట, చిల్లకూరు మండలాల తాసిల్దారులు సర్వేర్లు వీఆర్వోలు వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఇది మహిళా సంక్షేమ ప్రభుత్వం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి - ఇంటికో పారిశ్రామికవేత్తను చేయడమే బాబు ధ్యేయం

మహిళా గ్రూపులకు రూ.7.5 కోట్ల చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే అమర్

విశాలాంధ్ర - పలమనేరు : ఇది మహిళా సంక్షేమ ప్రభుత్వమని, తెలుగు దేశ ప్రభుత్వ హయాంలోనే మహిళలు అన్ని విధాల అభివృద్ధి చెందుతున్నారని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్దనున్న మహిళా సమాఖ్య భవనంలో మండలంలోని గ్రూపు సభ్యులకు మెగా రుణమేళా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సమైక్య సభ్యులకు రూ. 7.5 కోట్ల చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాడు ఎన్టీఆర్ మహిళలకు అండగా నిలుస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చారని, అదేవిధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం మహిళల అభివృద్ధి కోసం డ్వాక్రా మరియు దీపంలాంటి గొప్ప పథకాలను తీసుకొచ్చారన్నారు. నాడు చంద్రబాబు ఆలోచనతో పుట్టిన డ్వాక్రా గ్రూపులకు రుణాలనిచ్చేందుకు బ్యాంకులు నేడు క్యూ కడుతున్నాయని అందుకు మహిళలు బ్యాంకులకు కల్పించిన నమ్మకమే కారణమన్నారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ప్రభుత్వం మరియు బ్యాంకులు అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. ప్రతి ఇంటిలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను చూడాలనేదే బాబు ధ్యేయంగా పెట్టుకున్నారని ఆ దిశగా మహిళలు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాదర్ భాషా, ఏపీఎం మొగిలీశ్వరయ్య,సీసీలుహరి,విజయ కుమారి, గురుమూర్తి మరియు మండల పార్టీ అధ్యక్షులు నాగరాజురెడ్డి,ప్రధానకార్యదర్శి గణేష్, నాయకులు జగదీష్ నాయుడు,మల్లీశ్వర్ రెడ్డి, వెంకట రత్నం,రామూర్తి నాయుడు, సెల్వ రాజ్, వెంకట ముని రెడ్డి, స్వతంత్ర బాబు, హరి, గిరి, శీనులతో పాటు జనసేన నాయకులు దిలీప్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శివయ్య బ్రహ్మోత్సవాలకు రండి

- కేంద్ర మంత్రులకు ఎమ్మెల్యే బొజ్జల ఆహ్వానం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: మా ఊరిలో జరిగే శివయ్య మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కేంద్ర మంత్రులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆహ్వానించారు. శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం పలువురు మంత్రులను కలిసి ఆహ్వాన పత్రికలను అందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రదాన్, కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మనసుఖ్ మండేయియా, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెడి కుమారస్వామి, మాజీ ప్రధాన మంత్రి, మాజీ కర్నాగక ముఖ్యమంత్రి, హెచ్ డీ దేవగౌడలతోటు పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్, అమలాపురం ఎంపీ హరిష్ బాలయోగిలను కలిసి ఆహ్వానించారు. శ్రీకాళహస్తి పర్యటన ద్వారా స్వయంభు వాయులింగేశ్వరునితోపాటు ఎంతో ప్రసిద్ధి గాంచిన భారతదేశంలో తొలి శివాలయం గుడిమల్లం ఆలయంలో పరశురమేశ్వరుని దర్శనం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు తప్పక పరమశివుని దర్శనానికి వస్తామని చెప్పారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అవసరం

నైపుణ్యాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేద్దాం - యువ క్రీడాకారుల ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలి

కేంద్ర మంత్రులకు ఎమ్మెల్యే బొజ్జల వినతి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ఏ 1 ఆధారిత అభ్యసన నమూనాలు, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ బలోపేతవం వంటి సంస్కరణలు అవసరమని తద్వారా నైపుణ్య అభివృద్ధితో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. ఢిల్లీలో మంగళవారం పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా విద్యా శాఖ మంత్రితో కలిసి పలు అంశాలపై ఆయన చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కీలక సంస్కరణలను కూడా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యలో ఆంధ్ర రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టడానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో రాష్ట్ర శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడును వెంటబెట్టుకుని ఎమ్మెల్యే బొజ్జల కలిశారు. ఈ సందర్భంగా జాతీయ ఎక్సలెన్స్ కేంద్రం, జిల్లా స్థాయిలో అదనపు ఖేలో ఇండియా కేంద్రాలు, మెరుగైన క్రీడా మౌళిక సదుపాయాలు, యువ క్రీడాకారులను ప్రొత్సహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యూత్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అవసరమైన సహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్ డీ కుమార స్వామిని కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాళహస్తిలో కొనసాగుతున్న ప్రాజెక్టులు, మౌళిక సదుపాయల మెరుగుదల, ఉపాధి కల్పన, సంక్షేమ కార్యక్ర మాలపై చర్చించారు. యువతకు ఉపాధి కల్పన దిశగా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు. ఆ మేరకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. మొత్తంగా ఢిల్లీ పర్యటనలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఒక పక్క శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులతో చర్చించి స్వామి కార్యం స్వకార్యం పూర్తి చేశారని చెప్పవచ్చు.

హిందూ ధర్మాన్ని భక్తులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ప్రారంభోత్సవంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ :

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా నేర్చుకున్న ప్రతి విషయాన్ని భక్తులు ప్రజల్లోకి తీసుకెళ్లి హిందూ ధర్మాన్ని విస్తరించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలో నేటి నుండి మూడు రోజులపాటు నిర్వహించనున్న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవ కార్యక్రమం ఆస్థాన మండపంలో మంగళవారం వైభవంగా ప్రారంభ మైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు ఈవో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. 1979లో టీటీడీ ప్రారంభించిన దాస సాహిత్య ప్రాజెక్టు సంకల్పం పరిపూర్ణమై ప్రజల్లోకి వెళ్లిందని చెప్పారు. మెట్లోత్సవానికి విచ్చేసిన భక్తులు మరోసారి వచ్చేటప్పుడు తోటి వారిని కూడా తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు.

తిరుపతిని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర -తిరుపతి : తిరుపతిని టూరిజం హబ్ గా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పరుస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి - ప్రయాగ్ రాజ్ ప్యాకేజి టూర్ బస్సును మంగళవారం ఉదయం అలిపిరి గరుడా సర్కిల్ వద్ద జెండా ఊపి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. మహాకుంభమేళలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా మంగళవారం, బుధవారంతో పాటు ఈనెల 18వ తేదీ పర్యాటక శాఖ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 144 ఏళ్ళకు ఒకసారి వచ్చే మహాకుంభమేళను ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేశారని ఆయన చెప్పారు. మహాకుంభమేళలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తే మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వామని ఆయన తెలిపారు. ప్రయాగ్ రాజ్ వెళ్ళేందుకు విమాన, రైలు సౌకర్యం ఉన్న భక్తులకు అందుబాటు ధరల్లో టూరిజం శాఖ బస్సు ప్యాకేజీలను ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. తిరుపతిని టూరిజం హబ్ గా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. మహాకుంభ మేళలో 45కోట్ల మంది భక్తులు ఇప్పటి వరకు పుణ్యస్నానాలు ఆచరించారని టిటిడి పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. సామాన్య భక్తులకు మహాకుంభమేళలో పాల్గొనే అవకాశం తొమ్మిది రోజుల టూర్ ప్యాకేజిగా టూరిజం శాఖ కల్పించడం అభినందనీయమని ఆయన చెప్పారు. టిటిడి సైతం మహాకుంభమేళలో భాగస్వామ్యమై సేవలందిస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరక్టర్ రమణ ప్రసాద్, డివిఎం శ్రీనివాసులు జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, యువరాజ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాగార్జున రావు, ఆముదాల వెంకటేశ్, మునస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచేవరకు సమ్మె విరమించేది లేదు: పశు వైద్య విద్యార్థులు

విశాలాంధ్ర - తిరుపతి: శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం తిరుపతి పశు వైద్య విద్యార్థుల నిరవధిక సమ్మె ఈరోజుతో 9వ రోజుకు చేరుకుంది. విద్యార్థుల నిరసన తారస్థాయికి చేరుకుంటూ, స్టైఫండ్ పెంపుదల కోసం పటిష్ఠంగా కొనసాగుతోంది. 5వ రిలే నిరాహార దీక్షలో భాగంగా, ఈ రోజు 9 మంది పశు వైద్య విద్యార్థులు దీక్షకు కూర్చొనడం జరిగింది.ఆందోళనలో భాగంగా, విద్యార్థులు ఈ రోజు ఒక పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ఇతర వైద్య కోర్సుల విద్యార్థులకు అంది ంచే స్టైఫండ్‌తో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచాలని ప్రధాన డిమాండ్‌గా పేర్కొన్నారు. గత 13 సంవత్సరాలుగా తమ స్టైఫండ్ పెరగలేదని, 2022లో జరిగిన 28 రోజుల నిరవధిక సమ్మె సందర్భ ంగా అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గారు స్పందించి తక్షణమే పెంచుతామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటికీ పెంపు జరగలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈరోజు శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య గారు, రిజిస్టర్ డాక్టర్ శ్రీలత గారు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ చంగల్ రాయల్ గారు, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ శోభామణి గారు మరియు అసోసియేటెడ్ డాక్టర్ జగపతి రామయ్య నిరవధిక సమ్మె జరుగుతున్న శిబిరానికి వచ్చి విద్యార్థులతో మాట్లాడు తూ, విద్యార్థులను తరగతులకు వెళ్ళ మని నిరవధిక సమ్మెను విరిమింప చేసుకోమని సూచించారు కానీ విద్యార్థులు తమ స్టాఫ్ అండ్ ఇతర మెడికల్ విద్యార్థుల స్టైఫండ్ కు సమానంగా పెరిగేంతవరకు సమ్మెను పిరమింప చేసేది లేదని తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు అనేక మంచి పథకాలను తీసుకొచ్చిందని, వారి హక్కైన స్టైఫండ్ పెంపుదలపై కూడా న్యాయమైన నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావం విద్యార్థుల్లో ఉందని తెలిపారు. "మా డిమాండ్ పూర్తిగా మా హక్కును సాధించుకోవడమే. ఇది ప్రభుత్వ వ్యతిరేక పోరాటం కాదు. ఇతర వైద్య కోర్సుల విద్యార్థులకు స్టైఫండ్ పెంచినట్లే, మా స్టైఫండ్ పెంచినప్పుడే మా సమ్మెను విరమిస్తాము." అని విద్యార్థులు స్పష్టం చేశారు.ఈ ఆందోళనకు రాజకీయ కోణం ఉందని కొందరికి అనిపించవచ్చని, అయితే వాస్తవానికి ఇది విద్యార్థుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటమని వారు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని పశు వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి, నాయుడుపేట, పిచ్చాటూరు, నాగలాపురం, నగరి, డక్కిలి, సదుం,
పూతలపట్టు, ఐరాల, తవణంపల్లి, యాదమరి, బైరెడ్డిపల్లె, శాంతిపురం,
గుడుపల్లె, చిత్తూరు రూరల్, పాలసముద్రం
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 94909 52134